# మా బావ ★

★ శ్రీమతి పొన్నపల్లి అన్నపూర్ణాదేవిగారు

మా బావ చిన్నప్పటినుండీ మా యింట్లోనే వుంటూఉండేవాడు. నేను, మా బావ కూడ యెప్పుడూ స్నేహంగావుంటూ, ఆటపాటలలోను, చదువువిషయంలోను, సమంగా వుంటూవుండేవాళ్లము. నాతరువాత నాతల్లిదండ్రులకు మరల పిల్లలులేకపోవుటచే, నన్నూ, మాబావను కూడ యెంతో గారాబంగా చూచుకొంటూవుండేవాళ్లు. మేము వున్నవూరు ఒకమాదిరి పల్లెటూరుఅగుటచే, నాకు సామాన్యపు చదువుమాత్రము చెప్పించి, మాకు సమీపంలోవున్న రాజమండ్రిలో బి.ఏ. చదువుచున్న ఒకఅబ్బాయికి నన్నిచ్చి వివాహము చేశారు. కొద్దిరోజులు గడచినతరువాత, పెంచి పెద్దదానినిచేసిన నా తల్లి, దండ్రులను, సోదరవాత్సల్యముతో ఆడుచూ పాడుచూ పెరిగిన మాబావను, వదలి నేను మాఅత్తవారి యింటికి వెళ్లవలసివచ్చినది. అత్తవారియింటికివెళ్లిన 5, 6 నెలలకు మావారి చదువుపూర్తి అయి, కాకినాడలో ఉద్యోగము వచ్చుటచే, మేమిద్దరము ఒంటరిగావెళ్లి అచట వుండవలసి వచ్చినది. తరువాత మేమిద్దరముగూడ యెంతో అన్యోన్యానురాగముతో ఏవిధమైన అరమరలులేక, ఆనందమయంగా కాలంగడుపుచున్నాము. కాలచక్రము యెప్పుడూ ఒకేరీతిగా వుండదుగదా! అది యెంతటివారలకైనా అతీతం.

ఇంతలో నాతల్లిదండ్రులకు చాల జబ్బుగావున్నదని టెలిగ్రాము వచ్చుటచే, నేను, మావారు కలసి మాపుట్టింటికి వెళ్లితిమి. మేము వెళ్లేలోపలే కలరాజాడ్యమువలన నాతల్లిదండ్రు లిరువురు మరణించిరి. 10 రోజులు గడచినఅనంతరం, మాబావ అక్కడ ఒక్కక్షణమైనా ఉండలేక, చదువు పూర్తిఅగుటచే యెక్కడనైనా 10 రూపాయలు సంపాదించుకొనెదనని వెళ్లిపోయినాడు. నేనుకూడ నాతల్లిదండ్రులులేని ఆగృహములో ఒక్కరోజయినా గడపజాలక వెంటనే నేను, మావారుకలసి కాకినాడకు వచ్చేశాము. ఇలావుంటూవుండగా మాయింటిప్రక్కన, బి. ఏ. చదువుచున్న ఒకఅమ్మాయి నాకు బాగాపరిచయమయి అప్పుడప్పుడూ మాయింటికివస్తూ యెంతో స్నేహంగా వుంటూవుండేది. వేసవిసెలవులిచ్చుటచే ప్రతిరోజూ మాయింటికివచ్చి న్యూస్‌పేపరు తీసుకొని వెళ్లి చదువుకొంటూ, పేపరువిషయాలు ముచ్చటించుతూ మావారినికూడ మాట్లాడిస్తూవుండేది. యిందుమూలమున మా వారికికూడ బాగా పరిచయమయింది. రానురాను యీపరిచయమే మాకాపురమునకు

తీరని యిక్కట్టులు తెచ్చిపెట్టినది. మావారిచర్యలు అన్నీ గ్రహిస్తూనేవున్నాను. యింట్లో వున్నధనమంతా ఆఖరయినది. కొన్నినగలన్నీ ఆఖరయినాయి. చివరకు నామాటఅంటేనే సరిపడేదికాదు. ఒకరోజురాత్రి యింటికివచ్చేసరికి చాలప్రొద్దుపోయినది. తలుపుతీసి చూసేసరికి మనిషి మనస్పృహలోనే లేరు. రెండవ దురలవాటు త్రాగుడుకూడ అలవాటయిందని తెలుసుకొన్నాను. మరుసటిరోజు రాత్రికూడ యిదేమాదిరి మైకములోవచ్చి ఆ అర్థరాత్రమున నన్ను "నీకు, నాకు యేవిధమైన సంబంధంలేదని" యింటినుండి తరిమివేశారు.

ఆ అర్థరాత్రియందు నన్నుకనికరించు కరుణామయులు ఎవ్వరుంటారు? హాదైవమా! నాగతియేమిటి, ఆప్తులైనటువంటి తల్లిదండ్రులాలేరు. చిన్ననాటనుండి సోదరవాత్సల్యముతో బెరిగిన బావయెక్కడవున్నదీ అంతేతెలియదే! విద్యవిపరీతముగా నేర్చినఫలితము, సుఖంగా గడుపుకొంటున్న మాబోటి కాపరములకు విచ్ఛిన్నము కలుగజేయుటేయని గ్రహించుటము ఖ్యాంశముకాబోలు. అనుకొంటూ రైలుస్టేషనుకువెళ్లి, నాదగ్గర మిగిలివున్న చిన్ని వుంగరమునుమార్చి అడబ్బుపెట్టి రాజమండ్రివెళ్లి, వూళ్లో మా మామగారికొరకు విచారించగా, నా నిర్భాగ్యస్థితికితగినట్లు అచట మామగారుకూడలేరు. అట్టిస్థితిలోవున్న నాయందు ఆదరణజూపువారెవరు! చేతిలో చిల్లిగవ్వఅయినాలేని నాబోటి అభాగ్యురాలు ఏసంస్థలోనయినాజేరి కుటీరపరిశ్రమల శిక్షణబొంది బ్రతుకుదామంటే ఉచితముగాజేరుటకు యెచట స్థానములేదుగదా! అనుకొని పగలంతా అలాగే ఆహారములేకుండగడపి, ఏవిధమైన దారిలేక, సాయంత్రమువేళ గోదావరిబడ్డుకు వెళ్తూవుంటే, దారినపోతూ నాదీనావస్థను చూచి వారిపాటికివారు పోవుటేతప్ప నాసంగతి యెవ్వరికిపడుతుంది. అలాగే గోదావరిబడ్డుకు జేరి, ఓ మహాతల్లీ, నాబోటిఅభాగ్యజీవికి ప్రపంచంలో యెచటను స్థానములేదు. నీలోనైనా జేర్చుకొనెదవా? ఏమీ! నీవుకూడ పనికిరానా? అంటూ గుభాలున దూకేసరికి, వెంటనే యెవ్వరో 'ఆగు, ఆగు' అంటూ నాదరికివచ్చి నన్నుబయటికితీసిరి. ఆమహాత్ములెవరో భార్యాభర్తలిరువురు. నన్ను వారియింటికిజేర్చి, స్పృహవచ్చేవరకు పరిచర్యలుజేసి, తరువాత నేనీవిధముగా విరక్తిజెందుటకు మొదలైన కారణములుఅడుగగా అన్నియుజెప్పితిని.

తదుపరి వారినిగురించిన వివరములుగూడ అడుగగా, నాచిన్ననాటిబావ మధుసూధనరావు. ఒక్కసారి ఆశ్చర్యానందములు కలిగినవి. ఒకరినిఒకరు తెలుసుకొన్నతరువాత మాబావ, అక్కకూడ నన్నుయెంతో ఓదార్చినాకుయేదో ఒకదారి కలుగజేయవలెనని దీక్ష

వహించిరి. మాబావ రాజమండ్రిలో ప్రైవేటుప్రాక్టీసుపెట్టుకొని డాక్టరుగా వుంటూ వున్నాడు. అక్కకూడ బావకుతగిన సుగుణమంతురాలు. నాకుక్రమేణ ఓపికవచ్చేవరకు మందులువాడి, బాగా ఆరోగ్యము చేకూరినతరువాత నన్ను ఒకస్కూలులోజేర్చిరి. అలాగే నేనుకూడ అమితశ్రద్ధతో చదువుటచే కొద్దికాలములోనే యింటరుమీడియెట్ ప్యాసు కాగలిగితిని. వెంటనే మాబావ ఉద్యోగప్రయత్నము జేయగా, స్త్రీవిద్యా ప్రచారక్ శాఖకు నాయకురాలిగా, కాకినాడకు ఆర్డరువచ్చినది. మాబావ, అక్క అనుమతిమీద నేను కాకినాడవెళ్లాను.

కాకినాడలో నాకు యిల్లుయిచ్చి, నెలకు 150 రూ. లు జీతముయిచ్చుచున్నారు. యిలాగే ఒక సంవత్సరముగడపి కొంతడబ్బును నిలవజేసి, నాస్వయంకృషిచేతనే అనాథశరణాలయము అంటూపెట్టి, అందులో అనాథలైనటువంటి స్త్రీలకు విద్య పరిశ్రమలు మొదలైనవన్నీ ఉచితముగా నేర్పుటకు ఏర్పాటుచేయించితిని. యిలాకొన్నాళ్లుగడచిన తరువాత యీసంస్థలో పనిజేయుటకై, చీలికలగుడ్డలుకట్టుకొని, వాడిపోయిన మొఖముతో గేటుదగ్గర నిలబడివున్న మనిషినిజూచి, లోపలకుపిలువగా, వెంటనే నాభర్తేనని గ్రహించితిని. తదుపరి ఆయననుగురించిన వివరములుఅన్నీ అడుగగా, తనకష్టములు అన్నీ చెప్పి, ఏదైయినా చిన్నఉద్యోగముచేసి బ్రతుకుదామని వచ్చితిననిరి. తరువాత మీతోటి వుంటున్న ఆయువతి ఎచ్చటవున్నదని అడుగగా యీవూరిలోనే యెచటనో వున్నదనిచెప్పెను; ఆమెనుకూడ పిలిపించి, నేనుపెట్టిన సంస్థలోనే, యిద్దరకు• ఉద్యోగముఏర్పాటుజేసి, యిద్దరూ వుండుటకు ఒకయిల్లు ఏర్పాటుజేసితిని. యిలాంటి అనాథ స్త్రీ శరణాలయములకు ప్రత్యేక అవసరములుంటవని, వీటి స్థాపన, పోషణకు దేశనాయకులు పాటుపడాలని ప్రచారం చేస్తూవుండేదాన్ని. యీసంస్థకు అన్నివిధముల సహకారం యిస్తూ, వారితప్పిదమును మరవగలిగిన నాశక్తిని నా ఉదారస్వభావాన్ని నామిత్రులకు చెపుతూవుండేవారు. వీటన్నిటికి మాబావ నాకు యిప్పించగలిగిన విజ్ఞానభిక్షయే కారణంఅని సంతోషపడేదాన్ని.

నాజీవితమంతాకూడ యిలాగే సేవామార్గముక్రిందనే ఉపయోగిస్తూ, అనాథలైన స్త్రీలను రక్షిస్తూ, స్త్రీవిద్యావ్యాప్తికొరకు కృషిజేయుచున్నాను. నన్నీవిధముగా పైకితీసుకు రాగలిగిన మాబావకు, అక్కకు నాకృతజ్ఞత తెలుపుతూ, వారికి యెల్లప్పుడు ఆయురారోగ్యైశ్వర్యములనిచ్చి కాపాడుగాక! అని భగవానుని ప్రార్థిస్తూవుండేదాన్ని.